వెయ్యి కోట్ల బడ్జెట్‌తో..

ఎట్టకేలకు అల్లు అర్జున్ కోసం త్రివిక్రమ్ పంథా మార్చుకున్నారు. ఇప్పటివరకూ తెలుగు ప్రేక్షకుల్ని మాత్రమే టార్గెట్ చేస్తూ సినిమాలు తీసిన త్రివిక్రమ్, ఇప్పుడు పాన్ ఇండియా ప్రేక్షకులవైపు దృష్టి సారించారు. 'పుష్ప'తో పాన్ ఇండియా స్టార్‌గా అవతరించిన బన్నీతో, పాత పంథాలు సినిమాలు తీయడం సబబు కాదని, భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కి తెరలేపారు త్రివిక్రమ్. దాదాపు వెయ్యికోట్ల బడ్జెట్‌తో ఈ సినిమా రూపొందనుందని నిర్మాత బన్నీ వాసు తెలిపారు. దీనికోసం ఆ స్థాయిలో ఫైనాన్స్ చేసే కార్పొరేట్స్‌ని, ఫైనాన్షియర్లను వెతుక్కోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. త్రివిక్రమ్‌కి పాన్ ఇండియా స్థాయి సినిమా తీసే సామర్థ్యం ఉందని బన్నీ నమ్మారని, వారిద్దరు రెండేళ్లు కష్టపడి ఓ కాన్సెప్ట్ అనుకున్నారనీ, ఇది చాలా బిగ్ ప్రాజెక్ట్ అని, దీని ప్రీ ప్రొడక్షన్‌కే ఏడాదిన్నర పడుతుందని బన్నీవాసు పేర్కొన్నారు.

అలా పిలుస్తుంటే ఆనందంగా ఉంది

'బ్యాడ్‌న్యూస్' విజయంతో గుడ్‌న్యూస్ అందుకొని మంచి జోష్‌మీద ఉన్నది 'యానిమల్' భామ త్రిప్తి దిమ్రి. 'యానిమల్'కి ముందు వరకూ నేషనల్ క్రష్ అంటే రష్మిక మందన్నా మాత్రమే. ఇప్పుడు ఆ బిరుదు త్రిప్తి దిమ్రికి కూడా ఇచ్చేశారు యూత్. ఈ ట్యాగ్‌పై ఆమె ఇటీవల స్పందిస్తూ 'అసలు నేను సినిమాను సీరియస్‌గా తీసుకోలేదు. తొలి సినిమా పూర్తి చేశాను. కెరీర్‌ని విధికే వదిలేశా. ఆ టైమ్‌లోనే 'లైలా-మజ్ను' అనే సినిమాకు సంబంధించిన ఆడిషన్స్‌లో కూడా పాల్గొన్నా. సరదాగా మొదలుపెట్టిన యాక్టింగ్.. ఉన్నట్టుండి సీరియస్‌గా మారింది. అదృష్టం బావుంది.. 'యానిమల్' వచ్చింది. ఇప్పుడందరూ నా యాక్టింగ్‌కి కనెక్ట్ అవుతున్నారు. ఈ రోజు అందరూ నన్ను నేషనల్ క్రష్ అంటున్నారంటే అదంతా వారి ప్రేమ, అలా పిలుస్తున్నందుకు ఆనందంగా ఉంది. అది నాపై మరింత బాధ్యత పెంచింది.' అంటూ ఆనందం వ్యక్తం చేసింది

శనివారం..శత్రు సంహారం

నాని కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా యాక్షన్ థ్రిల్లర్ 'సరిపోదా శనివారం' ఆగస్ట్ 29న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రచారపర్వంలో వేగాన్ని పెంచారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఇందులో ఎస్‌జే సూర్య కీలక పాత్రను పోషిస్తున్నారు. శనివారం ఆయన బర్త్‌డే సందర్భంగా 'నాట్ ఏ టీజర్' పేరుతో స్పెషల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. చెడు బలపడినప్పుడు దానిని అంతం చేసే పవర్ పుడుతుందనే వాయిస్ ఓవర్‌తో గ్లింప్స్ ఆసక్తిగా మొదలైంది. నెగెటివ్ ఛాయలున్న పోలీస్ అధికారి పాత్రలో సూర్య పరిచయమయ్యాడు. శనివారం మాత్రమే అదను చూసుకొని తన శత్రువులను అంతమొందించే వ్యక్తిగా నాని పాత్ర కొత్త పంథాలో ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ప్రియాంక అరుళ్‌మోహన్, సాయికుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతాన్నందిస్తున్నారు.

మధ్యతరగతి తండ్రి సంఘర్షణ

ప్రియదర్శి, నివేదా థామస్, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం '35 చిన్నకథకాదు'. నందకిషోర్ ఇమాని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి హీరో రానా సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా నుంచి విశ్వదేవ్ ఫస్ట్‌గ్లింప్స్‌ను శనివారం విడుదల చేశారు. ఇందులో ఆయన్ని బాధ్యత కలిగిన మధ్యతరగతి తండ్రి పాత్రలో చూపించారు. నేటితరం పిల్లలు, తల్లిదండ్రుల మధ్య అనుబంధాన్ని, సంఘర్షణను ఆవిష్కరించే చిత్రమిదని, తిరుపతి నేపథ్యంలో కథ నడుస్తుందని చిత్ర బృందం పేర్కొంది. వివేక్‌సాగర్ సంగీతాన్నందిస్తున్న ఈ చిత్రాన్ని రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది.

తెలుసు కదా.. మరింత స్టైలిష్‌గా

బ్లాక్‌బాస్టర్ 'టిల్లు స్క్వేర్' తర్వాత సిద్ధు జొన్నలగడ్డ నటించనున్న చిత్రం 'తెలుసు కదా'. నీరజ కోన ఈ సినిమా ద్వారా దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్ నిర్మించనున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆగస్ట్ 5 నుంచి మొదలుకానుంది. ఈ భారీ షెడ్యూల్‌లో టాకీ పార్ట్‌తో పాటు సాంగ్స్‌ని కూడా షూట్ చేస్తారు. హైదరాబాద్‌లో నెలరోజులపాటు సాగే ఈ షెడ్యూల్‌లో సినిమాలోని ప్రధాన తారాగణం మొత్తం పాల్గొంటారని మేకర్స్ తెలిపారు. సిద్ధు స్టార్‌డమ్‌ని దృష్టిలో పెట్టుకొని పర్‌ఫెక్ట్ స్క్రిప్ట్‌ని నీరజ రెడీ చేశారని, టాప్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో సినిమా నిర్మించనున్నామని, అందుకే ప్రీప్రొడక్షన్ విషయంలోనే జాగ్రత్తలు తీసుకున్నామని, రాశీఖన్నా, శ్రీనిధిశెట్టి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో సిద్ధు మరింత స్టైలిష్‌గా కనిపించనున్నారని మేకర్స్ తెలిపారు.

అంచనాలు నిజమయ్యాయి

వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రం 'ది బర్త్‌డే బాయ్'. రవికృష్ణ, సమీర్ మళ్లా, రాజీవ్ కనకాల, ప్రమోదిని, వాకా మని, రాజా అశోక్, వెంకటేశ్, సాయిఅరుణ్, రాహుల్ ప్రధానపాత్రధారులు. విస్కీ దర్శకుడు. ఐ.భరత్ నిర్మాత. శుక్రవారం విడుదలైన ఈ సినిమా మంచి స్పందన వస్తోందని, మౌత్‌టాక్‌తో, క్రిటిక్స్ అభినందనలతో సినిమా ముందుకు దూసుకుపోతున్నది మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం థాంక్స్ మీట్ ఏర్పాటు చేశారు. చిన్న సినిమాలకు పెద్ద విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలని, సాంకేతికంగా అందరికీ నచ్చే సినిమా ఇదని నిర్మాత తెలిపారు. ఇదొక కాన్సెప్ట్ ఫిల్మ్ అని, నిజాయితీగా తీశామని, దానికి ప్రతిఫలమే ఇదని దర్శకుడు చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు.

గోదారి అందాల నడుమ..

సదన్, ప్రియాంక ప్రసాద్ జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విష్ణ్నేష్ దర్శకుడు. పీఎల్‌వి క్రియేషన్స్ పతాకంపై పారమళ్ల లింగయ్య నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. శనివారం ఈ సినిమా గ్లింప్స్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..గ్లింప్స్ చూస్తుంటే కొత్త కంటెంట్‌తో తెరకెక్కించారని అర్థమవుతున్నదని, సాయికుమార్ సంభాషణలు ఆసక్తికరంగా ఉన్నాయని అన్నారు. టైటిల్‌కు తగినట్టే సహజమైన లొకేషన్లలో చిత్రీకరణ జరుపుతున్నామని, గోదావరి అందాలు, అక్కడి ప్రజల జీవన విధానాన్ని ఆవిష్కరించే కథ ఇదని నిర్మాత పారమళ్ల లింగయ్య తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ, రచన-దర్శకత్వం: పీఎల్ విష్ణ్నేష్.

లేడీ డెడ్‌పూల్ సాహసం

రయన్ రెనాల్డ్స్ హుయ్ జాక్‌మెన్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన హాలీవుడ్ మూవీ 'డెడ్‌పుల్ అండ్ వాల్వరిన్'. మార్వెల్ స్టూడియోస్ పతాకంపై షాన్ లెవీ రూపొందించిన ఈ సినిమా ఈ నెల 26న ప్రపంచవ్యాప్తంగా ఇంగ్లిష్‌తోపాటు హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన టీజర్లు, ట్రైలర్లు ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఇప్పుడు ఆ క్రేజ్‌ని మరింత పెంచుతూ ఈ సినిమా ఫైనల్ ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. గత ట్రైలర్స్ మాదిరిగానే 'డెడ్‌పుల్ అండ్ వాల్వరిన్'తో పాటు మరికొందరు సూపర్‌హీరోలు కూడా ఈ సినిమాలో ఉన్నారని ట్రైలర్ చెబుతున్నది. ఈ ట్రైలర్‌లో లేడీ డెడ్ పుల్, అలాగే వాల్వరిన్ కూతుర్ని పరిచయం చేశారు. డెడ్‌పుల్, వాల్వరిన్‌ల యాక్షన్ సీక్వెన్స్‌ని ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారని మేకర్స్ చెబుతున్నారు.

మహిళలు ఆదరిస్తున్నారు

వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రూపొందిన 'పేక మేడలు' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. రాకేష్ వర్రే నిర్మాత. మహిళా సాధికారత నేపథ్యంలో రూపొందించిన తమ చిత్రానికి మంచి ఆదరణ లభిస్తున్నదని మేకర్స్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'అన్ని కేంద్రాల్లో మంచి స్పందన లభిస్తున్నది. ముఖ్యంగా మహిళా ప్రేక్షకులు చక్కటి ఆదరణ కనబరుస్తున్నారు' అన్నారు. మంచి కంటెంట్‌తో తీసిన చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందనడానికి ఈ సినిమా ఉదహరణ అని నిర్మాత రాకేష్ వర్రే తెలిపారు.